## క్లుప్తంగా

### రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

- ఎమ్మెల్యే బొజ్జు పటేల్


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జన్నారం: కొనుగోళ్లు వేగవంతం చేసి, ధాన్యం విషయంలో రైతులకు ఇబ్బంది కలిగించొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సాయంత్రం ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. రైతులు అధైర్య పడొద్దని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. అధికారులు కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని, వారికి అండగా నిలువాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని విధాల సాయంగా ఉంటామని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రవి, ఏవో సంగీత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, నాయకులు ఇసాక్, ఇందయ్య, రాజన్న, సతీశ్, తదితరులున్నారు.

### కల్యాణం..కమనీయం


కల్యాణ వేడుక జరిపిస్తున్న చినజీయర్‌స్వామి

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ప్రాంతంలో గల శ్రీపంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ రజతోత్సవ వేడుకలు ఈ నెల 17న ప్రారంభమై శ్రీ సీతారామకళ్యాణ వేడుకతో ముగిసాయి. ఆలయ సమీపంలోని మిథులా మైదాన ప్రాంగణంలో గురువారం ఆలయ రజతోత్సవ వేడుక ముగింపు కార్యక్రమంతో పాటు హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆలయ నిర్వాహకులు అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య రామానుజ చినజీయర్‌స్వామి నిర్వహించిన శ్రీరామాయణ యాగపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ, శ్రీసీతారాముల కల్యాణ వేడుక ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏరియా జీఎం దేవేందర్ దంపతులు, సీఐ శశిధర్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్షాపరులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**గుడి నిర్మాణం వేగవంతం చేయండి**


మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): మండలంలోని బొక్కలగుట్టలో గల ఋష్యమూక పర్వతాన్ని చిన జీయర్‌స్వామి గురువారం సందర్శించారు. అక్కడ నిర్మించే గుడి పనులను పరిశీలించి గిరి ప్రదక్షణ గురించి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, తనవంతు కైంకర్యంగా రూ.లక్ష 16వేల నగదు నిర్వాహకులకు అందించారు.

### భాగ్యరెడ్డి వర్మ జయంతి


నివాళులర్పిస్తున్న కమిషనర్, సిబ్బంది

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని మున్సిపల్ కార్పొరేట్ కమిషనర్ శివాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ కరుణాకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### శిక్షణ పరిశీలన


మాట్లాడుతున్న ఎంఈవో తిరుపతిరెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల వృత్యాంతర శిక్షణను గురువారం ఎంఈవో తిరుపతిరెడ్డి పర్యవేక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించే విధంగా ఉపాధ్యాయులను సిద్ధం చేయాలని శిక్షకులకు సూచించారు.

### నేడు రైతులతో ర్యాలీ

తాండూర్: నకిలీ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించడానికి శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలో రైతులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి ఐబీ అండర్‌బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీలో రైతులు, అన్ని రాజకీయపార్టీల నాయకులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కర్షకులకు కష్టాలు..!

- అకాల వర్షాల నుంచి ధాన్యం కాపాడుకునేందుకు అవస్థలు
- కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని వేడుకోలు


కలమడుగులో కుప్పపై నీటిని తొలగిస్తున్న రైతు

జన్నారం: అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేసింది. జన్నారంలో బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఎడతెరిపి లేకుండా అత్యధికంగా 97మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి తెలిపారు. జన్నారం మండలంలోని మురిమడుగు, కలమడుగు, కవ్వాల్, దేవునిగూడ, పొనకల్, తపాలపూర్, రాంపూర్ తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం చుట్టూ వరదనీరు చేరడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు. అయినప్పటికీ తపాలపూర్, పొనకల్, కలమడుగు గ్రామాల్లో ధాన్యం వరదలో కొట్టుకుపోయింది. రైతుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, వాతావరణం ప్రభావం వల్ల తేమశాతం గురించి ఇబ్బంది పెట్టొద్దని తెలంగాణ ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

**కన్నెత్తి చూడని అధికారులు..**

కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడంలో జాప్యం జరుగుతున్నా స్థానిక అధికారులు కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా కొనుగోళ్లు పూర్తయినట్లు ఏవో సంగీత ప్రకటన ఇవ్వడంపై రైతులు, మాజీ వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చింతగూడ వైస్ చైర్మన్ విజయధర్మా ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాల్లో ఉండి చెప్పడం కాదు, కొనుగోలు కేంద్రాలకు వచ్చి చూస్తే ఏర్పడుతుందని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మిగిలిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

### సగం తూకం వేశారు



నేను రెండెకరాల్లో పొలం పండించాను. 20రోజులుగా కేంద్రంలో పోసి ఎదురుచూస్తున్నాను. బుధవారం మధ్యాహ్నం వరకు నా వడ్లు తూకం వేశారు. సగం పూర్తయ్యాయి. మరో సగం తూకం వేసే లోగా వాన మొదలైంది. నా బస్తాలు, ధాన్యం కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డాను.

– ముజ్జన్న, రైతు, కలమడుగు

### ధాన్యం పందుల పాలు..



జైపూర్: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ముసురు వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిపోగా, వరద నీటికి కొంత కొట్టుకుపోయింది. జైపూర్ సాగర్‌రావుకాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో పెగడపల్లికి చెందిన రాజేందర్ వరిధాన్యం తడిసిపోగా నిర్వాహకులు సరిగ్గా ఏర్పాట్లు చేయకపోవడంతో ధాన్యాన్ని పందులు తిన్నాయి. రాత్రింబవళ్లు పండించిన పంట కళ్లముందే పందులు తినడం, తడిసి వరద నీటికి కొట్టుకపోవడంతో రైతు కన్నీరుపెట్టుకున్నాడు.

### వర్షంలోనే ధాన్యం కుప్పలు



వేమనపల్లి: మండలంలోని ధాన్యం కేంద్రాల్లో ధాన్యపు రాసులు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. వర్షం కురుస్తుండటంతో తీసుకెళ్లేందుకు లారీలు రాక వేచి చూస్తున్నారు. ధాన్యపు బస్తాలు, రాసులపై కవర్లు కప్పుకున్నా వరదనీరు ఎక్కువై సంచులు, ధాన్యపు బస్తాలు తడిసిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోయిన నిల్వలను త్వరగా కొనుగోలు చేయాలని కోరుతున్నారు.



### అకాల వర్షంతో అరిగోస

భీమారం: అకాల వర్షాలతో అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ధాన్యం కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. ఆరబెట్టేందుకు ఎండ లేకపోవడం, అమ్ముకుందామంటే ఈ అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. కవర్లు కప్పినా ధాన్యం కాపాడుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోతన్‌పల్లి, ఆరెపల్లి, భీమారం గ్రామాల్లో వరిధాన్యంపై కవర్లు కప్పినా కుప్పల కింద నుంచి వరదనీళ్లు వెళ్లినట్లు తెలిపారు. భీమారం, పోతన్‌పల్లి, ఆర్కెపల్లి శివారులో ఇంకా కోతలు చేపట్టని వరిపొలాలు ఉన్నాయన్నారు. కాగా గురువారం మధ్యాహ్నం నుంచి తిరిగి వర్షం ప్రారంభమైంది. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి కొనుగోళ్లు త్వరగా చేపట్టాలని వేడుకుంటున్నారు.

### నిలిచిన నీరు


శెట్‌పల్లిలో ధాన్యం కవర్లపై నిలిచిన వర్షపు నీరు

కోటపల్లి/భీమిని/కాసిపేట: అకాల వర్షానికి ధాన్యం తడిచి ముద్దవుతోంది. కోటపల్లి మండలంలోని శంకరాపూర్, శెట్‌పల్లి, ఆలుగామ, ఎదులబంధం, దేవులవాడ, కాసిపేట మండలంలోని మల్కేపల్లి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. కురుస్తున్న వర్షాలకు సంచులు వేసిన కూడా కింద నుంచి నీరు చేరి తడిచిపోతున్నట్లు రైతన్నలు తెలిపారు. అధికారులు స్పందించి ధాన్యం త్వరగా తరలించేలా చూడాలని కోరుతున్నారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లో చేతికొచ్చిన వరిపంట వర్షానికి నేలకొరిగింది. చిన్నగుడిపేటకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మలో ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు డీటీ విజయ తెలిపారు. కొన్నింటివి పై కప్పులు, మరికొన్నింటివి గోడలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ఇళ్లను పరిశీలించిన తర్వాత నష్టాన్ని అంచనా వేస్తామన్నారు.


కొర్విచెల్మలో వర్షానికి కూలిన ఇంటి పైకప్పు

## ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ

నెన్నెల: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. గొల్లపల్లిలో కళ్లాల వద్ద కుప్పలు పోసిన వరిధాన్యాన్ని గురువారం ఏఓ సృజనతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, రైతులు ధాన్యం రాసులపై టార్పాలిన్‌లు, పాలిథిన్ కవర్లు కప్పి భద్రపర్చుకోవాలన్నారు. శుక్రవారం సాయంత్రంలోగా 6వేల గన్నీ సంచులు అందేలా చూస్తానన్నారు. రెండు రోజుల్లో తూకం వేయించి ధాన్యం తరలించేలా చర్యలు చేపడతామన్నారు. రైతులు తమ గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లగా, పక్కనే ఉన్న జోగాపూర్, మైలారంలోని కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఎక్కడ ఎటువంటి నష్టం జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలకు దెబ్బతిన్న వరి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఏఈఓ శైని, రైతులు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

## బీసీ ఉద్యమంపై కవితల పోటీలు

జన్నారం: బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్, విద్య, ఉద్యోగాల్లో 50శాతం కోట కోసం జరుగుతున్న ఉద్యమంలో మేధావులకు, రచయితలకు అవగాహన పెంపొందించడానికి కవులకు, రచయితలకు కవిత పోటీలు నిర్వహిస్తున్నట్లు బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి కన్వీనర్ చంద్రయ్య, కో కన్వీనర్లు కదార్ల నర్సయ్య, లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గల కవులు, రచయితలు ఈ కవిత పోటీల్లో పాల్గొనాలని కోరారు. కవితలు రాసి పంపిస్తే ఉత్తమ కవితలను ఎంపిక చేసి, బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. బీసీ ఉద్యమ ప్రస్థానం, రిజర్వేషన్ల ఆవశ్యకత అంశాలపై కవితలు రాయాలని సూచించారు. జూన్ 2న పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు చంద్రయ్య సెల్: 6281606258నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## ఆవిర్భావ వేడుకలపై సమీక్ష

నస్పూర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై జీఎం కార్యాలయంలో జీఎం శ్రీనివాస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 2న నిర్వహించే వేడుకల సందర్భంగా ఉదయం 8గంటలకు సీసీసీ కార్నర్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలవేసి అనంతరం జీఎం కార్యాలయం ఎదుట ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళి అర్పిస్తామని తెలిపారు. అనంతరం ప్రగతి స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఘనంగా నిర్వహించాలన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం బీభత్స, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, అరవిందరావు, ఆనంద్‌కుమార్, రవీందర్, వెంకటరామారావు, హనుమాన్‌గౌడ్, కాంతారావు, మేఘన తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి**

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జీఎం శ్రీనివాస్ తెలిపారు. 2024–2025 వార్షిక క్రీడల్లో కోల్ ఇండియా, ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ టోర్నమెంట్స్‌లలో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు యాజమాన్యం అందించే నగదు బహుమతులను క్రీడాకారులకు అందించారు. కార్యక్రమంలో డీజీఎం అరవిందరావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ కొమురయ్య, అధికారులు వెంకటేశ్వర్ రెడ్డి, పాల్ సృజన్, అశోక్, నర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జీఎం శ్రీనివాస్

**మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత**

నస్పూర్: సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని జీఎం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయం వద్ద నిర్మాణంలో ఉన్న ఫంక్షన్‌హాల్‌లో సదుపాయాలను, ఆర్కే 5 కాలనీలోని స్విమ్మింగ్ పూల్‌ని, కృష్ణాకాలనీలోని శాంతి స్టేడియం వాకింగ్ ట్రాక్, త్వరలో ఏర్పాటు చేయబోయే చిల్డ్రన్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక కుటుంబాలకు అన్ని మౌలిక వసతుల కల్పనకు అధికారులు సమన్వంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎంలు అరవిందర్‌రావు, ఆనంద్‌కుమార్, అధికారులు జక్కారెడ్డి, సత్యనారాయణ, భరత్ భూషణ్, రణదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

### రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



ఆర్కే 7 గని ఎదుట అధికారులు

నస్పూర్: రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని మినిస్ట్రీ ఆఫ్ కోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎండీ అఫ్తాబ్ ఆలమ్ అన్నారు. ఆర్కే 7 గనిని ఆయన జీఎం శ్రీనివాస్‌తో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గనిలో బొగ్గు ఉత్పత్తి రవాణా, భద్రతా చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. రక్షణ చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గని ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, ఇంజనీర్ రాజా రవిచరణ్, రక్షణ అధికారి సంతోష్ రావు పాల్గొన్నారు.


భీమారం: కోదండరామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


జన్నారంలో రామయజ్ఞం చేస్తున్న భక్తులు


దండేపల్లి: మేదరిపేటలో సామూహిక చాలీసా పారాయణం




చెన్నూర్ పంచముఖాంజనేయ ఆలయంలో..

## ఘనంగా హనుమాన్ జయంతి

మంచిర్యాలఅర్బన్/చెన్నూర్‌రూరల్/చెన్నూర్/భీమారం/జన్నారం/దండేపల్లి: హనుమాన్ జయంతి వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల భక్తులు రామయజ్ఞం నిర్వహించారు. ఆలయాల్లో హనుమాన్, రామ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దండేపల్లి మండలం మేదరిపేట శ్రీ హనుమాన్ ఆలయంలో భక్తులు 108సార్లు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఉదయం 4గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చాలీసా పారాయణం కొనసాగింది. పలువురు హనుమాన్ దీక్షాపరులు దీక్ష విరమించి, కొండగట్టుకు పయనమయ్యారు.

## బస్టాండ్‌లో 'పుష్కర' రద్దీ

మంచిర్యాలఅర్బన్: కాళేశ్వరంలోని సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తులతో మంచిర్యాల బస్‌స్టేషన్ ప్రాంగణమంతా రద్దీగా మారింది. ఈ నెల 15నుంచి 26వరకు పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. రోజురోజుకు పుష్కరాలకు వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. మంచిర్యాల బస్‌స్టేషన్ నుంచి 30 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. మహాలక్ష్మీ పథకం.. హైదరాబాద్ ఇతర ప్రాంతాల నుంచి రైలుమార్గం ద్వారా వచ్చిన భక్తులు కాళేశ్వరం వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు వస్తున్నారు. దీంతో అదనపు బస్సులు నడిపిస్తున్నారు. గురువారం ఉదయం 5గంటల నుంచి 11గంటల వరకు దాదాపు 20 బస్సులకు పైగా కాళేశ్వరానికి నడిపించారు. బస్సు వచ్చిందంటే చాలు సీటు కోసం కిటికీలోంచి దూరడం.. వస్తువులను సీట్లపై వేయడం వంటి పాట్లు పడుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.


మంచిర్యాల బస్‌స్టేషన్ ప్రాంగణంలో భక్తుల రద్దీ

## ప్రతీ రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎల్లారం గ్రామంలో గురువారం ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై రైతులకు ఏడీఏ సురేఖ అవగాహన కల్పించారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రతీ రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దన్నారు. గ్లైపోసైట్ మందు వాడడం వల్ల పర్యావరణం కాలుష్యంతో పాటు అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. పంటల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం కన్నెపల్లిలోని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఏవో సాయిప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సురేఖ